నేడు జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా కేంద్రం బుధవారం ప్రారంభం కానున్న జగనన్న క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాల్లో పాల్గొంటారని అన్నారు. జగనన్న క్రీడా సంబరాలను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ముఖ్య అధితిగా పాల్గొని ప్రారంభిస్తారని, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ప్రజా ప్రతినిధులు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు నుంచి ఆర్‌సిఎం ప్రాంగణంలో ప్రారంభోత్సవ వేడుకలు ఉంటాయని చెప్పారు.

పెట్టుబడి వేలల్లో మద్దతు ధర వందల్లో

ఓవైపు భారీగా పెరిగిన పెట్టుబడి... మరోవైపు స్వల్పంగా పెరిగిన ధాన్యం ధర... ధాన్యం దిగుబడీ అంతంతమాత్రమే. దీంతో, అందరికీ అన్నంపెట్టే రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఎప్పటి మాదిరిగా ఈ ఏడాది కూడా ధాన్యపురైతులు అప్పల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి దాపురిస్తోంది.

- దిగుబడి అంతంతమాత్రమే
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలిసి సుమారు 4లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. గతంతో పోలిస్తే పెట్టుబడి ఎక్కువగానే పెరిగింది. విత్తనం, నారు, నీరు, దుక్కి, దమ్ము, ఎరువులు, పురుగుల మందులు, కలుపుతీయడం, కోతలు, మోతలు, నూర్పుల పెట్టుబడి, శ్రమ కలిపి ఎకరాకు సుమారు రూ.45వేల నుంచి రూ.50వేల వరకు మదుపు అవుతోందని రైతున్న లెక్క కడుతున్నాడు. ఇందులో ఈ ఏడాది పెరిగిన మదుపు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఉంది. ముఖ్యంగా ఎరువుల ధర, ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. ఎకరా విస్తీర్ణానికి యూరియా రెండు బస్తాలు, పొటాష్, పాస్ఫేట్ ఒక్కొక్క బస్తా వేశారనుకుంటే నాలుగైదువేలు ఖర్చవుతోంది. ఇక నారుపోతకు అదును మొదలుకుని దుక్కి, దమ్ము వరకు ట్రాక్టర్ అద్దెకు కూడా అంతకన్నా ఎక్కువే. ఇటీవల కాలంలో పెట్రోల్, డీజిల్ ధరల అమాంతంగా పెరిగిపోవడం ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. అయినా నేలతల్లిని నమ్ముకుని వున్న రైతులు సాగుకోసం అప్పులు చేసుకుంటూ పంట పండించారు. ఇటువంటి పరిస్థితుల్లో అందుకనుగుణంగా ధర పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం అత్తెసరుతో సరిపెట్టింది. సాధారణ రకం క్వింటాకు రూ.2040, ఎ-గ్రేడ్ రూ.2060 చొప్పున ధర నిర్ణయం చేసింది. గతంతో పోలిస్తే పెంచిన ధర అక్షరాల వంద రూపాయలు మాత్రమే. మరోవైపు దిగుబడి కూడా పెద్దగా పెరగలేదు. విజయనగరం జిల్లాలో ఇప్పటివరకు 27శాతం వరి కోతలు పూర్తికాగా, 666చోట్ల పంటకోత ప్రయోగాలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో సగటున 21క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో 90శాతం సాధారణ రకంగానే గుర్తించడం ఏళ్ల తరబడిన చరిత్ర. దీన్నిబట్టి ఎకరా వరి సాగులో రూ.42,840 మాత్రమే. దీన్నిబట్టి రైతులకు మిగిలిందేమీ లేదన్నది స్పష్టమౌతోంది. ఈనేపథ్యంలో తమను ఆదుకోవాలని రైతులు, వారి తరపున రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో అన్నదాత కన్నీరు తుడవాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలుపైనే తగిన భరోసా ఇవ్వలేని పరిస్థితి దాపురిస్తోంది.

ఎకరాకు రూ.44,950 పెట్టుబడి

ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేయడానికి ఈ ఏడాది నాకు రూ.44,950 మదుపు అయ్యింది. ఇందులో విత్తనాలు కొనుగోలు మొదలుకుని దుక్కి, ఎరువులు, పురుగు మందులు సహా 25రకాల ఖర్చులు ఉన్నాయి. ముదుపంతా అప్పుచేసి పెట్టాను. దానికి మూడు నెలల వడ్డీకూడా లెక్కించాల్సి వచ్చింది.

వసంత సుధీర్, వరి రైతు
బుడతనాపల్లి, గంట్యాడ మండలం

టీచర్ల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో ఉన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

విజయవాడలో గురువారం జరగబోయే యుటిఎఫ్ ధర్నాకు హాజరు కాకుండా జిల్లాకు చెందిన పలువురు యుటిఎఫ్ నాయకులను రూరల్ పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, గరుగుబిల్లి మండల ప్రధాన కార్యదర్శి తంగుడు శ్రీను, సీతానగరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒమ్మి రామకృష్ణ, పల్లి శ్రీనివాసులను ముందస్తుగానే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. సాయంత్రం విజయవాడకు వెళ్లే అన్ని ప్రైవేటు బస్ సర్వీస్‌లు ముగియడంతో నాయకులను విడుదల చేశారు.

ఉపాధ్యాయులకు నోటీసులు

వీరఘట్టం :ఈనెల 30న విజయవాడలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాకు ఉపాధ్యాయులు హాజరు కాకుండా ఉండేందుకు మంగళవారం స్థానిక పోలీసులు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజుకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ అరెస్టులు, నోటీసులతో ఉద్యమాలు ఆపలేరని, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రైతులకు ఇ క్రాప్ రశీదులు పంపిణీ

కలెక్టరేట్: రైతులకు ఇ - క్రాప్ నమోదు చేసిన రశీదు డౌన్‌లోడ్ చేసి పంపిణీ చేసే కార్యక్రమాన్ని మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఇ-క్రాప్ నమోదు చేసిన రైతులకు రశీదు కాపీ అందజేయాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. అవసరమైతే వాలంటీర్ల సేవలు వినియోగించుకో వచ్చునని తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం డబ్బులు జమకాని, పెండింగులో గల రైతుల ఖాతాలను ఇ-కెవైసి పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం పశుసంవర్థక ఉద్యానవన, మత్స్యశాఖల అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా పశుసంవర్థక అధికారి ఏ. ఈశ్వర రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్

సమస్యలను పరిష్కరించుకుంటూ లక్ష్యాలను చేరుకుందాం

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్
- గుంకలాం జగనన్న కాలనీ సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు పథకం తాలూక ఫలాలు ప్రతి పేదవాడికీ అందాలంటే.. మన పరిధిలో ఉన్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్దామని, లక్ష్యాలను చేరుకుందామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. అనుకున్న లక్ష్యాలను, నిర్ణీత కాలంలో చేరుకోవాలంటే జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని నిర్దేశించారు. విజయనగరం, పార్వతీపురం జిల్లా కలెక్టర్లకు అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జగనన్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ రాష్ట్రంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల గురించి, సాధించిన ప్రగతి గురించి వివరించగా విజయనగరం, పార్వతీపురం జిల్లా కలెక్టర్లు ఎ. సూర్యకుమారి, నిశాంత్ కుమార్ ముందుగా ఆయా జిల్లాల్లో జరిగిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని వివరించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నిర్నీత గడువులోగా రెండు జిల్లాలకు కేటాయించిన ఇళ్లను పూర్తి చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. పనుల్లో మరింత జోరు కనిపించాలని, మరో రెండు నెలల్లో వీలుంటే జిల్లాలో పర్యటిస్తానని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశాలను, ఆశయాలను అర్థం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను ఒక మహా యజ్ఞంలా సాగించాలని పేర్కొన్నారు.

మంత్రి దృష్టికి పలు అంశాలు

ఉమ్మడి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు గృహ నిర్మాణాల్లో ఉన్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, రెండు జిల్లాల కలెక్టర్లు ఎ.సూర్యకుమారి, నిశాంత్ కుమార్, విజయనగరం, అరకు ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, విక్రాంత్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, కంబాల జోగులు, కళావతి, జాయింట్ కలెక్టర్లు మయూర్ అశోక్, ఒ.ఆనంద్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సివిల్ సప్లయ్ డిఎం దేవుళ్ళ నాయక్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ధాన్యం కొనుగోళ్లలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఖరీఫ్ సీజనుకు సంబంధించి వ్యవసాయ శాఖ ధాన్యం దిగుబడి అంచనాలకు అనుగుణంగా రైతుల సౌకర్యార్థం జిల్లాలో గల 306 రైతు భరోసా కేంద్రాలను (ఆర్బికె), ప్రొక్యూర్మెంట్ సహాయ ఏజెన్సీ (పిఎస్‌ఎ)ల ద్వారా అనుసంధానం చేసి 188 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 188 రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ప్రారంభించిందని, ఇప్పటికే అన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటికే 22,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం ఉండేలా చూడాలని, దగ్గరలో గల రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న గోనె సంచులు, హమాలీలు, రవాణా (జిఎల్‌టి) వంటి మౌలిక సదుపాయాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని కోరారు. ఖరీఫ్ 2022-23 సీజనుకు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు నిమిత్తం అన్ని రకాల సదుపాయాలతో కూడిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాకు సాధారణ రకం రూ.2040, గ్రేడ్-ఏ రకము రూ. 2060 ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి 08963-293037, 7702003582 కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఉదయం 8.00 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

జీడీ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు

సీతంపేట :ఐటిడిఎ పరిధిలో గల టిపిఎంయు మండలాలకు ఏడు జీడీ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు మంగళవారం టిఎంయు మండలాల ఎపిఎంలు, పరిశ్రమల శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ జీడీ ప్రాసెసింగ్ యూనిట్లను గ్రౌండింగ్ చేసేటప్పుడు విద్యుత్, పరిశ్రమల శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని చేయాలని అన్నారు. గ్రౌండింగ్ చేసేటప్పుడు సాధ్యమైనంత వరకు లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు సహకరించాలని సూచించారు. పరిశ్రమల శాఖ నుంచి అవసరమైన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, విద్యుత్ శాఖ డిప్యూటీ డిఇఇ తిరుమలరెడ్డి, పరిశ్రమల శాఖ ఎడి, వైకెపి ఎపిడి నారాయణరావు, టిపిఎంయు మండలాల ఎపిఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

డ్వామా కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

జియ్యమ్మవలస మండల కేంద్రంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తు తోటపల్లి సుజాత పలు అవినీతికి అక్రమాలకు పాల్పడ్డారని, తక్షణమే ఆమెను విధుల నుంచి తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయం వద్ద ఉపాధిహామీ వేతనదారులు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి గంగునాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలి పనులకు వెళ్లని వారికి మస్తర్లు వేసి బిల్లులు చెల్లించుకున్నారని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, వలస కూలీలు, గ్రామంలోని చిరువ్యాపారుల పేరున ఎన్‌ఎంఆర్‌లు రాసి లక్ష రూపాయలు అవినీతికి పాల్పడినట్లు సాక్ష్యాత్తు అధికారుల విచారణలో రుజువైందని అన్నారు. అయినా ఇంతవరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించలేదన్నారు. తక్షణమే ఫీల్డ్ అస్టింట్‌ను సస్పెండ్ చేసి, స్వాహ చేసిన సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డ్వామా పీడీకి వినతిని అందజేశారు. దీనికి పీడీ స్పందిస్తూ ఫీల్డ్ అస్టెంటల్ సుజాతను ఈనెల 26 నుంచి విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, పి.రాము, ఉపాధ్యక్షులు చింతల తవిటినాయుడు, భూతాలు మోహన రావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

షెడ్యూల్డ్ ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

గిరిజన సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని షెడ్యూల్ ఏరియాలో గల యువకులకు షెడ్యూల్ ఏరియా ధ్రువవపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యాన మంగళవారం గిరిజన నిరుద్యోగులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. షెడ్యూల్ ఏరియా ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు గిరిధర్, మజ్జి నారాయణరావు, ఎస్.జయసింహ ఆధ్వర్యాన గిరిజన ఉద్యోగులు, విద్యార్థులు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కొంతమందికే షెడ్యూల్డ్ ధ్రువపత్రాలు మంజూరు చేశారని, అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు మంజూరు చేసేవరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మోటారు వాహనాలు వేలం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నాటుసారా కేసుల్లో పట్టుపడ్డ మోటార్ వాహనాలను మంగళవారం వేలంపాట వేసినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజ్ చేయబడిన వాహనాలు ప్రభుత్వ అనుమతితో వేలంపాట వేయనున్నట్టు ఆరు మోటారు వాహనాలను వేలంపాట వేశామన్నారు. కార్యక్రమంలో డిఎఫ్‌డిటిఎఫ్ గోపాలకృష్ణ, పోలీసు సిబ్బంది, వేలంపాటదారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగుపై
సాధికార బృందం పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయ విధానాల అధ్యాయంలో ప్రపంచ మహిళా సాధికార సంస్థ బృందం పరిశీలించింది. రెండురోజులుగా ఈ బృందం జట్టు ట్రస్ట్ ద్వారా పార్వతీపురం మన్యం ప్రాంతంలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సాల్వేజ్ ఫ్రాన్సిస్, డీన్ కెడాల్, మంజు గోర్డియా పరిశీలించారు. వ్యవసాయంలో, నిర్ణయాధికారంలో, పాలనలో మహిళల పాత్ర అనే అంశంపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ముందుగా జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విస్తరణ గురించి అడిగి తెలుసుకున్నారు. బయో గ్రామాలుగా రైతులు ఎలా మారారో తెలుసుకున్నారు. జట్టు ట్రస్ట్ ముఖ్య సలహాదారు డాక్టర్ డి. పారి నాయుడు ద్వారా 1988లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలు, విటిడిఎలు ఎలా బలోపేతమయ్యాయి? వారు మొదట్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నారు? వాటిని ఎలా అధిగమించారు? ప్రస్తుతం మహిళా సంఘాల ద్వారా ఎటువంటి కార్యక్రమాలు నడుస్తున్నాయి? వ్యవసాయంలో వారి పాత్ర? ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళలు ఎంతవరకు కృషి చేస్తున్నారు? గిట్టుబాటు ధర ఎలా పొందుతున్నారు? అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాభూమి, అన్నపుర్ణేశ్వరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ద్వారా రైతులకు అందుతున్న సేవలు, మహిళా రైతుల భాగస్వామ్యం, విలువ జోడింపు కార్యక్రమాల గూర్చి డైరెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో చేరడం ద్వారా రైతులకు అందుతున్న అదనపు సేవలు, ఆదాయాల గురించి తెలుసుకున్నారు. మాభూమి డైరెక్టర్ మర్రాపు నాగమణితో మాట్లాడి కుటుంబ, గ్రామ సంబంధిత నిర్ణయాధికారంలో మహిళా పాత్ర తెలుసుకున్నారు. అన్నపుర్ణేశ్వరి గిరి శక్తి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సెక్రటరీ మరడాన లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఇప్పుడు ప్రపంచంతో పోటీ పడుతున్నారని, నైపుణ్యాలు పెంచుకుని మహిళా శక్తిగా ఏర్పడి సాధికారత సాధించారని, మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని, అందులో భాగంగా రైతుల కంపెనీ ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ వ్యాప్తిలో ఉత్పాదకత పెంచడం, ఆరోగ్యం పోషణ, విద్య మొదలైన అంశాల్లో మహిళల పాత్ర చాలా అధికమని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అమలు, 365 రోజులూ వివిధ పంటలు పండించడం మొదలైన కార్యక్రమాలను వివరించారు. అర ఎకరా అన్నపూర్ణ పంటల నమూనా ద్వారా 4వేల మంది మహిళా రైతులు సుస్థిర, సురక్షిత ఆహారం పొందుతున్నారని, ఆరోగ్య భద్రతకు ఈ నమూనా ఎంత అవసరమో వివరించారు. అనంతరం అన్నపూర్ణ పంటల నమూనా సందర్శించారు. ప్రభుత్వం ద్వారా రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి దీని ద్వారా అందుతున్న సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రపంచ సాధికార బృందానికి వివరిస్తున్న షణ్ముఖరాజు

కురుపాం : మండలంలో జట్టు సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న కొండబారిడి, దురబిలి, మంత్రజోల, వలసబల్లేరు గ్రామాలను ప్రపంచ మహిళా సాధికార బృందం పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడ గిరిజనులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం, వారు స్థితిగతులను తెలుసుకొని న్యూట్రిషన్ సెంటర్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందుకున్న పౌష్టిక ఆహారం తెలుసుకొని అనంతరం వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్లోబల్ ఉమెన్ స్ట్రైక్ ఆర్గనైజేషన్ లండన్ దేశానికి చెందిన సాల్వ్ ప్రిన్సెస్, మెంబర్ అఫ్ తే డే మేన్స్ నెట్వర్క్ లండన్ డాన్ కేడల్, ఎన్సీఎంఎస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మంజు గోరియా, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరావు, జట్టు సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ నూకంనాయుడు, జట్టు సంస్థ సిబ్బంది కె.భూషణరావు, ఎం.ప్రసాద్, సరోజినీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగో విడత జగనన్న విద్యా దీవెన

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న విద్య దీవెన నాలుగో విడత నిధులను బుధవారం విడుదల కానున్నాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.గయాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదువుతున్న ప్రతి పేద విద్యార్థి చదువుకయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి తల్లుల బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. జిల్లాలో 22,472 మంది వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలో రూ.11,65,75,221 కోట్లను జమ చేస్తామన్నారు.

సకాలంలో నాడు-నేడు పనులు పూర్తి: డిఇఒ

ప్రజాశక్తి - పాచిపెంట

నాడు- నేడు నిధులు చేపడుతున్న పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ ఎంఇఒకు, హెచ్‌ఎంలకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంఇఒ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. సిబ్బందితో మన బడి, నాడు నేడు, జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు పంపిణీ ఆన్లైన్ చేసే విధానాన్ని సమీక్షించారు. అనంతరం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించి టెన్త్ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తరగతిలో విద్యార్థులకు కొద్దిసేపు బోధన చేశారు. అలాగే మధ్యాహ్నం భోజనం నిర్వహణ, అమలు తీరును పరిశీలించారు. ఆ తర్వాత కెజిబివిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పనులు పూర్తి చేయాలని సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రమణ

ఇకెవైసి వివరాలు నమోదు పూర్తి చేయాలి : పిఒ

సీతంపేట :రైతుల పిఎం కిసాన్ ఇకెవైసి వివరాల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. మంగళవారం అగ్రికల్చరల్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇకెవైసి డేటాను సచివాలయం వారీగా తయారుచేసి వాలంటీర్లకు పంపిణీ చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదని సూచించారు. అర్హత ఉన్న ప్రతి రైతు వివరాలు ఇకెవైసి చేయాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిపోయిన వారి వివరాలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎఒ హరికృష్ణ, ఎఒ తిలక్, అగ్రికల్చరల్, డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రమహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్యకాస నాయకులు

8 నుంచి వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రమహాసభలు

కలెక్టరేట్ :ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రమహాసభలు డిసెంబర్ 8,9,10 తేదీల్లో జంగారెడ్డి గూడెంలో జరుగుతాయని, ఈ సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆవిర్భావం నుంచి కూలీలు సమస్యలపై భూమి కోసం, కూలికోసం పోరాడుతుందన్నారు. రానున్న మూడేళ్లలో కూలీల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కర్తవ్యాలు నిర్ణయం చేసి పని చేస్తున్నట్లు తెలిపారు. కావున ఈ మహాసభలకు పెద్దఎత్తున వ్యవసాయ కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, నాయకులు చింతల తవిటి నాయుడు, మర్రి శ్రీనివాసరావు, పాలమెట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

వాహనాలు తనిఖీ

పాలకొండ రూరల్ : స్థానిక యాలం జంక్షన్ వద్ద డిఎస్‌పి కృష్ణారావు ఆధ్వర్యంలో మంగళవారం పలు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా వాహనాల పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాటికి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మంచి ఫలితాలు

సీతానగరం : వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ ద్వారా మంచి ఫలితాలు సాధించి వచ్చని, దీనిపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ జి.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ జి.సూరిదేముడు మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఫిజియోథెరపీ చేస్తున్నామని, దీన్ని మండలంలో గల ప్రత్యేక అవసరాల పిల్లలు సద్వినియోగం చేసుకొని, పిల్లల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు పి.కృష్ణమోహనరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇ. అంజనేయులు మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి న్యాయవ్యవస్థ చట్టాలు గూర్చి తెలుసుకొని గ్రామంలో తల్లిదండ్రులకు, గ్రామస్థులకు న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది బరాటం చంద్రమౌళి, మండల లీగల్ సెల్ కమిటీ సభ్యులు అందవరపు కోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి కుర్చీలు అందజేస్తున్న సర్పంచ్ లోకనాథం

పిహెచ్‌సిలకు కుర్చీలు, వాటర్ క్యాన్లు వితరణ

కురుపాం : మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పెద గొత్తిలి సబ్‌సెంటర్‌కు మంగళవారం పెదగొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం కుర్చీలు, మినరల్ వాటర్ క్యాన్లు స్వచ్ఛందంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలకు, గర్భిణీలకు వైద్యులు పిహెచ్‌సిల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తూ గిరిజనులను ఎల్లవేళలా వైద్యులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నీలకంఠాపురం వైద్యులు అభినవ్‌కుమార్, మొండెఖల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మొండెఖల్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ దృష్టికి వీరఘట్టం సమస్యలు

వీరఘట్టం :మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర జనసేన క్రియాశీలక సభ్యులు బిపి నాయుడు విన్నవించారు. మంగళవారం మంగళగిరిలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన పవన్‌ను కలిసి సమస్యలను వివరించారు. మండలంలోని కిమ్మి-రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన పనులు పూర్తికాలేదని, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న ఆరు పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పల్లెల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని, తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునికీకరణ పనులను పూర్తిచేయాలని కోరారు. అనంతరం పవన్‌కల్యాణ్‌కు వినతిని అందజేశారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన బిపి నాయుడు

వార్డుల్లో సబ్‌కలెక్టర్, కమిషనర్ పర్యటన

పాలకొండ రూరల్ : పట్టణంలోని నాగవంశపువీధి జంక్షన్, అరిసెం చర్ల తదితర ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం ఉదయం పర్యటించారు. అపరిశుభ్రాన్ని పరిశీలించారు. కాలువల్లో పూడికలను పరిశీలించి పూర్తిస్థాయిలో వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, సచివాలయ , నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

60 మందికి ఆరోగ్య తనిఖీలు చేయాలి

వీరఘట్టం :గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించినప్పుడు 60 మంది వరకు రోగులను తనిఖీలు చేయాలని డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు వైద్యాధికారిణి పి.ఉమామహేశ్వరికి సూచించారు. మండలంలోని నడుకూరులో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలపై ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్‌సిడి కేసులు కూడా నమోదు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేయాలని సూచించారు. ఆశా యాప్‌లో పెండింగ్ ఉన్న వాటిని తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో యోగేశ్వర్ రెడ్డి, సూపర్‌వైజర్లు శాంతికుమారి, నవనమ్మ, ఎఎన్ఎం సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు తెలియకుండా నియామకాలా?

మండల సర్వసభ్య సమావేశంలో ఉప వైద్యాధికారిని నిలదీసిన ఎంపిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యూల నియామకాలను ఎలా చేపడుతారని జిల్లా ఉప వైద్యాధికారి సి.దుర్గాకల్యాణిని ఎంపిపి కె.దీనమయ్య ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో నియామకాలను చేసేటప్పుడు కనీసం ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఉప వైద్యాధికారి సమాధానమిస్తూ తాను మూడు నెలల క్రితం బాధ్యతలు చేపట్టానని, తన హయాంలో ఎటువంటి నియామకాలు జరగలేదని అన్నారు. కోసింగి భద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నాడు -నేడు నిధులు ఖర్చు చేయకపోవడంతో విద్యార్థులు తాగేందుకు మంచినీటి సౌకర్యం లేదని ఇరిడి ఎంపిటిసి కె.మల్లేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. మొదటి విడత నాడు నేడులో ఈ పాఠశాలకు రూ.24 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులు ఏమయ్యాయో అంతు పట్టడం లేదని అన్నారు. సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్వయంగా ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పిస్తే గాని ఇకపై వారికి జీతాలు చేయొద్దని వెటర్నరీ వైద్యులు లక్ష్మణరావును ఆదేశించారు. లోవ ముఠా ప్రాంతమైన బీరుపాడు, బయ్యాడ, జర్న గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత సిబ్బంది స్పందించడం లేదన్నారు. తక్షణమే విద్యుత్ స్తంభాలు మార్చాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు కోరారు. అలాగే గొయ్యిపాకలో ఒకే ఒక్క డిపి ఉన్నందున దానిపై లోడ్ పెరిగి ప్రతిసారి మరమ్మతులకు గురవుతుందని, కావున అదనంగా మరొక డిపిని ఏర్పాటు చేయాలని ఎఇని కోరారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ఏవైనా కొత్తగా మంజూరైన పనులకు ఆయా సర్పంచులు, ఎంపిటిసిలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి ప్రారంభించాలని అన్నారు. మండలంలో ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేపట్టాలని వైద్యులను కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు పలుచోట్ల నూతన భవనాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి. జగదీష్‌కుమార్, తహశీల్దార్ జె.రాములమ్మ, వైస్ ఎంపిపి లక్ష్మణరావు, జడ్పిటిసి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సి.దుర్గాకల్యాణి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఏజెన్సీలో మాతా శిశు మరణాల సంఖ్య తగ్గిందన్నారు. దీన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముగ్గురి కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారి జాబితాపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో ఫ్యామిలీ ప్లానింగ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం సిహెచ్‌సిలో ఫ్యామిలీ ప్లానింగ్ చికిత్స అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్ కుమార్ ఉన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

పెసలు, మినుములు, రాగులు, వేరుశెనగ విత్తనాలను 90 శాతం రాయితీతో రైతులకు ఐటిడిఎ పిఒ బి.నవ్య మంగళవారం పంపిణీ చేశారు. మంగళవారం ఐటిడిఎలో రైతులకు రాయితీతో కూడిన విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఎఒ విజయరాణి, పిఎఒ హరికృష్ణ, ఎఒ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి ఒక్కరి ఓటుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆధార్ అనుసంధానం 6-బి ఫారానికి సంబంధించి బిఎల్‌ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఓటు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసుకునేందుకు ఓటర్లను చైతన్యపర్చి డోర్ టు డోర్ సర్వే నిర్వహించి 18ఏళ్లు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు హక్కు కల్పించడానికి 6-బి ఫారానికి సంబంధించి అవగాహన కల్పించి ఓటు హక్కులు పొందేలా చేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒదేనని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, బిఎల్ ఒలు పాల్గొన్నారు.

కిడిగేసులో ఫ్యామిలీ డాక్టర్

జియ్యమ్మవలస : రావాడ రామభద్రపురం పిహెచ్‌సి పరిధిలో కిడిగేసులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి పి.శ్రావణ్ కుమార్ నిర్వహించారు. గ్రామంలో గల 40 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. బిపి, షుగర్ తదితర వాటికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక రోగులు ఎవరూ లేరని ఎవరికీ ఎటువంటి జ్వరం ఇతరత్రా వ్యాధులు కూడా లేవని శ్రావణ్ కుమార్ తెలిపారు

మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

మేలైన యాజమాన్య పద్ధతులు, సర్టిఫికేషన్‌పై రైతులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 60 మంది రైతులకు ఆర్.వెంకంపేటలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మండల సలహా మండలి చైర్మన్ పోల ఈశ్వర నారాయణ, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎలు ఆర్.శ్రీనివాసరావు, బి.శారద మేలైన వ్యవసాయ పద్ధతుల మార్గదర్శకాలను వివరించారు. పార్వతీపురం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ టి వెంకటేష్ సేంద్రియ వ్యవసాయ పద్ధతి లాభాలను వివరించారు. విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు వరిలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయంలో ప్రథమ, ద్వితీయ దుక్కులు, కాలిబాటల ఆవశ్యకత, విత్తన శుద్ధి, ఎరువుల, పురుగు మందుల యాజమాన్యాల గురించి వివరించారు. సమగ్ర సస్యరక్షణ అపరాల్లో కలుపు నివారణ తదితర అంశాలపై వివరించారు. రస్తకుంట బాయ్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.సౌజన్య అపరాలలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కర్నూలు జిల్లాలోని ధ్రువీకరణ సంస్థ నుంచి వచ్చిన ప్రతాప్‌రెడ్డి సర్టిఫికేషన్ గురించి వివరించారు. రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తే గిట్టుబాటు ధర బయట మార్కెట్‌లో ఎక్కువ గా పలుకుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వ్యవసాయ స్థితిగతులు. సేంద్రియ వ్యవసాయంపై ఆవశ్యకత గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి ఎస్ అవినాష్ వరి కొనుగోలుపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. గోనె సంచులు, హమాలీ రవాణా రైతు ఏర్పాట్లు చేసుకుంటే ఆ పైకం రైతులు ఖాతాలో నేరుగా వేసేలా 21 రోజుల్లో ధాన్యం డబ్బులతో పాటు వస్తాయని తెలిపారు. శిక్షణలో గ్రామ సర్పంచ్, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వాకాడ నాగేశ్వరరావు

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. కౌన్సిలర్లు మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. రెండు వర్గాలుగా మారి సమావేశం వేదికగా మాటలు విసురుకున్నారు. గారమ్మకాలనీలో రూ.4 లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులకు బిల్లు చెల్లించాలని 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు కోరగా దానిపై 18, 5 వార్డు కౌన్సిలర్లు కిల్లారి మోహన్, వెలమల మన్మధరావు అడ్డుతగిలారు. జనరల్ ఫండ్ నుంచి అన్ని వార్డులకు నిధులు ఇవ్వాలని, ఒక్క వార్డులో పనుల కోసం నిధులు ఇవ్వడానికి వీలులేదని, అవసరమైతే 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి కేటాయించాలని పట్టుబట్టారు. దీనిపై దుప్పాడ పాపినాయుడు మాట్లాడుతూ గతంలో మీరు చేసే పనులకు ఏ విధంగా బిల్లులు తీసుకున్నారని ప్రశ్నించారు. దీంతో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. చివరికి ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ కలుగజేసుకుని సర్ధిచెప్పారు. ఇకపై ముందస్తు ఆమోదం పొంది పనులు చేపట్టాలన్నారు. కమిషనర్, చైర్‌పర్సన్ అనుమతితోనే పనులు చేయాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణతో పాటు తాగునీటి సరఫరా, వీధిదీపాలుపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. కొత్తవీధిలో డంపింగ్‌యార్డ్ వల్ల రజకులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రహరీగోడ ఏర్పాటు చేసి వారికి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పారిశుధ్యంపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. దీనికి పూర్తిసహకారం అందిస్తామన్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పార్లమెంటులో చేసిన చట్టాన్ని మార్చే హక్కు రాష్ట్రానికి లేదు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్లమెంటులో చేసిన చట్టానికి రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి చట్టం చేసే అధికారం లేదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎపి హైకోర్టు రాష్ట్రపతి అమోదంతో, కేంద్రప్రభుత్వం అంగీకారంతో పార్లమెంటులో చేసిన విభజన చట్టంలో ఉన్నట్లుగా అప్పట్లో రాష్ట్రంలో ఉన్న పార్టీలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించచన తర్వాత అమరావతి రాజధానిగా ఏర్పాటైందని అన్నారు. దీన్ని మార్చే హక్కు ఎవరికీ లేదన్నారు. నిన్న సుప్రీకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను వక్రీకరించి వైసిపి సంతోషం పడుతోందన్నారు. హైకోర్టు తీర్పులో అమరావతి రాజధాని ఏరియా నిర్మాణంలో ఇచ్చిన టైలైన్‌పైనే రాష్ట్రప్రభుత్వం స్టే కోరగా, వాటిపై ఇది వరకే స్టే ఇచ్చిందన్నారు. మిగతా వాటిని పై స్టేరాలేదని అన్నారు. పైగా హైకోర్టు అమరావతిలోనే ఉంటుందని స్పష్టం చేశారన్నారు. కోర్టులో ఒకలా, బయట మరోలా మాట్లాడుతూ వైసిపి నాయకులు సంతృప్తి పొందుతూ ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డిమోహనరావు, జివెంకటనాయుడు, జిరవి కుమార్ కౌన్సిలర్ బడే గౌరినాయుడు, కోల వెంకటరావు, జాగానధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

పార్వతీపురంటౌన్ : స్థానిక పాతబస్టాండ్ వద్ద పాడైన ఆర్‌అండర్‌బి రోడ్డుకు మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం ప్రారంభించారు. ప్రజాశక్తిలో ఈనెల 26న ప్రచురితమైన 'మంచు అనుకుంటున్నారేమో కానే కాదు దూళి' అన్న వార్తకు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ఐటిడిఎ బంకు నుంచి డంపింగ్ యార్డ్ వరకు ఆర్ అండ్ బి రోడ్డు ప్రధాన రహదారి భారీ వాహనాల రద్దీ వల్ల తీవ్రంగా పాడైపోయిన నేపథ్యంలో ఆ రోడ్డు పునర్నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.40 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వంచే ఇటీవల మంజూరు చేయించి, టెండర్లు పూర్తి చేసుకుని నేడు పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు పనులు సత్వరం పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాత బస్టాండ్ కూడలి నుంచి కొత్తవలస ఫ్లైఓవర్ వరకు రహదారిని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆర్‌అండ్‌బి డిఇ అప్పాజీ, మున్సిపల్ ఎఇ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు..


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని పాంచాలిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ సమస్యలు ఉంటే తెలియజేయాలని గ్రామస్తులను కోరారు. అర్హత ఉండీ సాంకేతిక లోపాల వల్ల పథకాలు వర్తించకపోతే తక్షణమే సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 50వ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా సచివాలయ సిబ్బంది ఏర్పాటుచేసిన కేకును కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ కె.సింహాచలం, పి.వీరంనాయుడు, పెద్దిబాబు, నారాయణరావు, టి.గౌరీశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

పార్వతీపురంటౌన్ :స్థానిక మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ ఇంఛార్జి అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలల్లో వచ్చే రక్తహీనత, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, రోగనిరోధకశక్తి, పౌష్టికాహారం వాటిపై వివరిస్తూ, అనంతరం రక్తహీనతను గుర్తించడం, లక్షణాలు, నివారణ చర్యలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల ఆవశ్యకత వివరించి లక్షణాలుగా గుర్తించిన విద్యార్థులకు వైద్య సిబ్బంది హీమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. విద్యార్థుల్లో ఆరోగ్య నివేదిక లైన హీమోగ్లోబిన్ శాతం, బరువు, అనారోగ్య సూచనలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి పర్యవేక్షణ చేయాలని వసతి గృహ సిబ్బందికి డాక్టర్ జగన్మోహన్ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.లక్ష్మణ్ బాబు , సూపర్ వైసర్ పుష్ప , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ మిత్రాలకు వేతనాలు త్వరగా చెల్లించాలి

భామిని : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేసిన క్లాప్ మిత్రాలకు జూన్ నిలిచిన వేతనాలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సత్వరమే చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను డిఎల్‌పిఒ జె.రాంప్రసాద్ ఆదేశించారు. మండలంలోని బాలేరు, భామిని, బత్తిలి సచివాలయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి పంచాయతీలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలించాలని, గ్రామాల్లో పూర్తి స్థాయిలో చెత్తసేకరణ జరగాలని, తడి, పొడి చెత్త వేరు చేసి ఎస్‌డబ్ల్యూపిసి ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని, పంచాయతీల్లో పూర్తి స్థాయిలో ఇంటి పన్ను సేకరించాలని, స్వామిత్ర సర్వే ద్వారా పంచాయతీ లో గ్రామ కంఠం భూమిని పూర్తి స్థాయిలో గుర్తించి కొలం -40లో నూతన నమూనా ప్రకారం సరిదిద్ది అధికారులకు నివేదించాలని సూచించారు. క్లాప్ మిత్రాల బకాయిలు త్వరగా చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.కృష్ణారావు, కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళా పోలీస్ చందన, మత్య సహాయకులు ఆదినారాయణ ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం జరుగనుంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో వార్డు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరు కానున్నారు.

నేడు సిహెచ్ బిన్నిడిలో గడపగడపకు

గుమ్మలక్ష్మీపురం :మండలంలోని లోవముఠా ప్రాంతమైన చాపరాయి బిన్నిడి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి కె.దీనమయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి హాజరవుతున్నట్లు చెప్పారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

పని ప్రదేశాల్లో గాని, ఇతర ప్రాంతాల్లో గాని లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు నిర్భయంగా ఐసిడిఎస్ అధికారులకు గానీ, పోలీసులకు గాని ఫిర్యాదు చేయాలని అర్బన్ ఐసిడిఎస్ సిడిపిఒ బి.సత్యవతి కోరారు. మంగళవారం పట్టణంలోని 2వార్డు అంగన్వాడీ కేంద్రంలో మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలనే వివక్ష చూపకుండా ఆడపిల్లలను ఉన్నత విద్య వరకు చదివించాలని కోరారు. లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఎ.పుష్ప పాల్గొన్నారు.

మక్కువ : బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం శంబర సెక్టార్లో ఎస్ఆర్‌పురంలో సూపర్‌వైజర్ లీలావతి అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలపై జరిగే లైంగిక దాడులు, మహిళలు పనిచేసే చోటు వారిపై జరిగే లైంగిక వేధింపుల గురించి గ్రామంలో ప్రజలకు, మహిళలకు, బాలికలకు వివరిస్తూ ఇలాంటి వేధింపులకు గురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలి, ఎలా మనల్ని మనం రక్షించుకోవాలని, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలో సూచించారు. కార్యక్రమంలో వెంకట భైరపురం సెక్టార్ సూపర్ వైజర్ పి.రాజశ్రీ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కురుపాం :మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వరహాలమ్మ అన్నారు. మండలంలోని మొండెఖల్, పి.లేవిడి గ్రామాల్లో ఐసిడిఎస్ పిఒ కె.విజయ్‌గౌరి ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపులు, లింగ నిర్ధారణ నేరాలపై ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు ఎవరిని సంప్రదించాలి, ఎలా ఎదుర్కోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.విజయగౌరి, పి.జానకమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, స్కూల్ టీచర్స్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని పిల్లలకు, సింగిల్ పేరెంట్ పిల్లలకు స్కూల్ బ్యాగులు, ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్) కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను యూత్ ఫర్ సేవా సహకారంతో సమాజ్ పరివర్తన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్‌ను సీతంపేట ఎఎస్ఐ జివి రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భామిని ఎంఇఒ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగపర్చుకొని అందరూ స్కాలర్‌షిప్ సాధించాలనే లక్ష్యంగా చదవాలని, పాఠశాల, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్కూల్‌లోని నిరుపేదలైన 25మంది విద్యార్థులను గుర్తించి వారికి స్కూల్ బ్యాగులు, ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను 14 మందికి అందించామని, ఈ మెటీరియల్‌ను విశాఖకు చెందిన యూత్ ఫర్ సేవ సంస్థ వారు సహకారం చేశారని సమాజ్ పరివర్తన్ డైరెక్టర్ మరియు యూత్ ఫర్ సేవ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమ సుందర్ రావు, గోవింద నాయుడు, పాణిగ్రహి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటన

శ్రీ వెంకటేశ్వర ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్, ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నెం.వి.ఆర్.110, దాసన్నపేట, విజయనగరం యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికలు తే.11-12-2022 దిన ఆదివారం విజయనగరం సంఘ కార్యాలయము వద్ద జరుపబడునని సంఘ సభ్యులందరికీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

1. ఎన్నిక కావలసిన పాలకవర్గ సభ్యులు	- 9 (తొమ్మిది) (రిజర్వేషన్లు లేవు)
2. నామినేషన్లు దాఖలు చేయు తేది	- 01-12-2022 గురువారం ఉదయం గం. 10.00 ల నుండి సాయంత్రం గం.5.00ల వరకు
3. నామినేషన్లు రుసుము ఎస్సీ, ఎస్టీలకు	- రూ. 100/-లు
బి.సి. లకు	- రూ. 200/-లు
ఓ.సి. లకు	- రూ. 400/-లు
4. నామినేషన్లు పరిశీలన తేది	- 02-12-2022 శుక్రవారం ఉదయం గం. 10.00ల నుండి
5. నామినేషన్లు ఉపసంహరణ తేది	- 03-12-2022 శనివారం ఉదయం గం. 10.00 ల నుండి సాయంత్రం గం. 5.00 ల వరకు
6. ఎన్నికల తేది	- 11-12-2022 ఆదివారం ఉదయం గం. 7.00 ల నుండి మధ్యాహ్నం గం. 2.00 ల వరకు
7. ఎన్నికల ఫలితాల ప్రకటన తేది	- 11-12-2022 మధ్యాహ్నం గం. 2.00 ల తర్వాత ఓట్లు లెక్కింపు
8. ఆఫీసు బేరర్ల ఎన్నిక తేది	- 13-12-2022 (అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శిని ఎన్నిక)

సం/- డి.ఆర్.ఎస్. ప్రసాదరావు
ఎన్నికల అధికారి
డిప్యూటీ రిజిస్ట్రారు (రిటైర్డ్)/సహకార శాఖ
శ్రీ వెంకటేశ్వర ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్. ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, విజయనగరం

తే. 28-11-2022 ది
విజయనగరం